క్లుప్తంగా

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



జాతీయ జెండా ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మక్కువ: మండల కేంద్రంలో ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, భారత్ మాతా కీ జై అని నినాదాలు చేశారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ భక్తి చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు భరత్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు వారాలకు మించిన దగ్గు టీబీ కావొచ్చు



మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ ప్రశాంత్

సాలూరు: ఎవరిలోనైనా రెండు వారాలకు మించి దగ్గు ఉంటే అది టీబీ(క్షయ) కావచ్చని, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన గురువారం సందర్శించి, కాసేపు మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి వ్యక్తికి టీబీ నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి టీబీ పేషెంట్‌కు మందులు వాడుతున్నంత కాలం నెలకు రూ.1000 చొప్పున అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు డా.ప్రియాంక, టీబీ సూపర్‌వైజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు

సాలూరు రూరల్: సాలూరు మీదుగా మానాపురం సంతకు ప్రతి వారం పశువులను అక్రమంగా తరలిస్తున్నారు. చిన్న చిన్న వాహనాల్లో భారీ కాయం(శరీరం) కలిగిన ఆవులు, గేదెలను రవాణా చేస్తున్నారు. మామిడిపల్లి, సాలూరు మీదుగా నాలుగు వ్యాన్‌లతో గేదెలను గురువారం తరలించారు. ఆ వ్యాన్‌ల డ్రైవర్లను ఎక్కడి నుంచి ఎక్కడకు వీటిని తరలిస్తున్నారని స్థానికులు ప్రశ్నించగా, కుందిలి నుంచి మానాపు రానికి అని వారు సమాధానం చెప్పారు.

నేత్ర శస్త్రచికిత్సకు 22 మంది ఎంపిక



మహిళ కళ్లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 22 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు ఆప్తాలమిక్ అధికారి గణేష తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఈర్ల సంజీవ నాయుడు సహకారంతో అల్లు నారాయణమ్మ జ్ఞాపకార్థం అల్లు సత్యం ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం సత్యసాయి మందిరం వద్ద నిర్వహించారు. మొత్తం 38 మంది కళ్లను తనిఖీ చేసుకునేందుకు రాగా వారిలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతూ ఆపరేషన్ అవసరమైన 22 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ఉచితంగానే ఆపరేషన్లు చేసి, మందులు అందివ్వడం జరుగుతుందన్నారు.

'ఉపాధి' కార్మికుల హక్కులపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఆర్‌పీ దాసు, వేతనదారులు

సీతానగరం: మండలంలోని ఏగోటివలస గ్రామంలో ఉపాధి హామీ పథకం, కార్మికుల హక్కులపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఐఈసీ(ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యునికేషన్) బృందాల ద్వారా సర్పంచ్ యు.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం, వేతనదారుల హక్కులను ప్రజలకు తెలియజేశారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఉపాధి పొంది, జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని ఎస్‌ఆర్‌పీ దాసు తెలిపారు.

పంచాయతీ నిధులపై దర్యాప్తు

కొమరాడ: స్థానిక పంచాయతీలో నిధులు దుర్వినియోగమయ్యాయని మండల కేంద్రానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ కొండలరావు కొమరాడ సచివాలయంలో సర్పంచ్, గ్రామస్తుల సమక్షంలో గురువారం దర్యాప్తు నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్లుచ తాగునీరు, మోటార్లు నిర్వహణ తదితర ఖర్చుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని, నివేదికను కలెక్టర్ సమర్పిస్తామని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పాచిపెంట గ్రంథాలయం!

- గ్రంథాలయ పరిసరాల్లో మందుబాబుల హల్‌చల్
- ఇబ్బందులకు గురవుతున్న పాఠకులు, సిబ్బంది
- రాత్రి వేళల్లో నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



గ్రంథాలయం వద్ద మందుబాబులు తాగిపడేసిన గ్లాసులు, ఆ పక్కనే చీపుళ్లతో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పాచిపెంట:

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మండల కేంద్రంలోని గ్రంథాలయం మారింది. ఈ లైబ్రరీ ఎదురుగానే రెండు మద్యం దుకాణాలు ఉండడంతో అక్కడ మందు కొనుగోలు చేసి ఇక్కడ తాగుతున్నారు. ప్రతిరోజూ రాత్రి మందులు ఇక్కడ తాగడంతో వారు తాగి వదిలేసిన మద్యంసీసాలు, వాడిపడేసిన గ్లాసులు, స్టఫ్ కవర్లు, విడిచిపెట్టిన ఆహారంతో గ్రంథాలయ పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దీంతో రోజూ గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, సిబ్బంది అంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవడానికి అనువుగా ఉండే స్థలంలో గ్రంథాలయం నిర్మాణం చేస్తే దాని ఏర్పాటు ముఖ్య ఉద్దేశం తెలియకుండా ప్రవర్తిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లైబ్రరీ ఎదురుగా మద్యం షాపులు..



లైబ్రరీ ఎదురుగా ఉన్న రెండు మద్యం షాపులు

గ్రంథాలయం ఎదురుగానే రెండు మద్యం షాపులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడి దుకాణాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చదువుకు నిలయమైన గ్రంథాలయం దగ్గర మద్యం షాపులు ఉండడమేంటి? లైబ్రరీ అని కూడా చూడకుండా మందుబాబులు ఇక్కడ మద్యం సేవిస్తుండడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సాధారణ పాఠకులతో పాటు నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన ఈ స్థలంలో ఇలా చేయడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మందుబాబులు హల్‌చల్ చేస్తున్న రాత్రి పూట నిఘా ఏర్పాటు చేస్తే ఈ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్థానికులు సలహా ఇస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించాలని కోరుతున్నారు.

చదువుకోవడానికి ఇబ్బందిగా ఉంది..



నేను గత రెండేళ్లుగా ఇదే గ్రంథాలయానికి చదువుకోవడానికి వస్తున్నారు. లైబ్రరీ ఎదురుగానే మద్యంషాపులు ఉన్నాయి. అక్కడ మద్యం కొనుగోలు చేసి, ఇక్కడి గ్రంథాలయ పరిసరాల్లో మందు తాగుతున్నారు. ఆ సమయంలో వారు మద్యం మత్తులో బూతులు మాట్లాడుతూ, పెద్దగా కేకలు వేస్తున్నారు. కొంతమంది అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, చదవడానికి ఇబ్బందిగా ఉంది.

– గదిపాము దాసు, పాచిపెంట

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

- రోడ్డు నిధుల రద్దుపై సభ్యుల ఆగ్రహం
- తీర్మానాలు ఇవ్వలేదంటూరు..ఇస్తే పనులు చేయరని మండిపాటు
- శంబర పణుకు వీధి రోడ్డు పనులు ఎందుకు రద్దు చేశారు?
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలకు డిమాండ్

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. పలు అంశాలపై సభ్యులు అధికారులను నిలదీశారు. తొలుత జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరిపించేందుకు సర్పంచ్‌లు తీర్మానాలు ఇవ్వకుండా అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారే తప్ప, తీర్మానాలు ఇచ్చిన పనులను చేయకుండా ఎందుకు రద్దు చేస్తున్నారని పీఆర్ జేఈ రంజిత్‌ను ప్రశ్నించారు. శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు శంబర గ్రామంలో రోడ్డు పనులు జరిపించేందుకు పంచాయతీ తీర్మానాలు ఇస్తే, మంజూరైన నిధులతో రోడ్డు వేయకుండా దానిని ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ ఆ పనులు ఎందుకు ప్రారంభించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పనులు సకాలంలో జరపకపోవడంతో మంజూరైన నిధులు రద్దు కావడం జరిగిందన్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారో సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయంపై పీఆర్ జేఈ రంజిత్ సమాధానమిస్తూ ప్రారంభించని పనులను కలెక్టర్ రద్దు చేశారని వివరించారు.

కోల్డ్ స్టోరేజ నిర్మాణమెప్పుడు?

మక్కువ జెడ్పీహెచ్‌ఎస్‌లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహిస్తామని పిలిచి, తీరా అక్కడికి వస్తే..అప్పటికప్పుడే కార్యక్రమాన్ని జూనియర్ కళాశాలకు మార్చారన్నారు. ఇది ప్రజాప్రతినిధులను అవమానించినట్టు కాదా అని జెడ్పీటీసీ శ్రీనివాసరావు ఎంఈవో శ్యామ్‌సుందర్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఎంఈవో బదులిస్తూ డీఈవో సూచనల మేరకే అప్పటికప్పుడు కార్యక్రమాన్ని మార్చడం జరిగిందని తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలకు వెళ్లడం లేదని, పాఠశాల పనివేళల మధ్యలో కూడా భోజనాల కోసం ఇంటికి వచ్చి, వెళ్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ కోరారు. అలాగే కాశీపట్నంలో కూరగాయల కోల్డ్ స్టోరేజ నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు అడ్వాన్స్‌గా మంజూరైనప్పటికీ ఎందుకు నిర్మాణ పనులు చేయలేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మిగతా సభ్యులు కూడా తమ పరిధిలోని సమస్యలను అధికారుల ఎదుట ప్రస్తావించి, ఆ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తహసీల్దారు కె.భరత్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేస్తున్నాం



తహసీల్దారు భరత్‌కుమార్

మక్కువ: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కె.భరత్‌కుమార్ సూచించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాల్లోని ప్రజలకు రెవెన్యూ సిబ్బంది సూచనలు ఇచ్చిందన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని కవిరిపల్లి కాజ్‌వేపై గోముఖినది వరద నీరు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, వరద నీటి ప్రవాహం సమయంలో ప్రజల రాకపోకలను ఆ దారిలో నిషేధించాలని సిబ్బందికి చెప్పామన్నారు. అలాగే దుగ్గేరు అడారు గెడ్డపై గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలు నిలుపుదలకు చర్యలు చేపడుతున్నామన్నారు. సీతానగరం మండలం సమీపంలోని కొత్తవలస ఆనకట్టపై కూడా రాకపోకలు నిరోధించేందుకు ట్రెంచ్ కటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

సీతానగరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో పాడిరైతులంతా తగిన జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయం నుంచి విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్య సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి, అప్రమత్తం చేశారు. ఎక్కడైనా మూగజీవాలు వ్యాధులతో బాధపడితే తక్షణమే వైద్యం అందించేలా చూడాలని కోరారు. జీవాలు వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు సూచనలు, సలహాలివ్వాలన్నారు.

- మండల కేంద్రానికి ఎగువనున్న ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడం వల్ల సువర్ణముఖి నదిపై ఉన్న సీతానగరం సాగునీటి(కొత్తవలస డ్యామ్)ప్రాజెక్ట్ మీదుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని తహసీల్దారు ప్రసన్నకుమార్ తెలిపారు. తుపాను వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఇరిగేషన్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ దారా మాట్లాడిన ఆయన..నదీతీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, వరదల సమయంలో నదుల దగ్గరకు వెళ్లకుండా చూడాలని తెలిపారు.

శతశాతం ఫలితాలకు కృషి చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో సింహాచలం

బలిజిపేట: శతశాతం ఫలితాలు సాధనకు విద్యార్థులు, సిబ్బంది అంతా కృషి చేయాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలని ఎంఈవో1 సామల సింహాచలం సూచించారు. మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన.. పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఇప్పటి నుంచే బాగా చదువుకుని, మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షించారు. ప్రత్యేక తరగతుల్లో సబ్జెక్టుల వారీగా ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఇంటి వద్ద కూడా కనీసం మూడు గంటల పాటు చదువుకోవాలన్నారు. ఎఫ్ఏ1 మూల్యాంకనం చేసి, మార్కులను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం లేక అవస్థలు





కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది, (ఇన్‌సెట్‌లో) డెన్సరాయిలో వైద్యసేవలందిస్తున్న తోణాం పీహెచ్‌సీ వైద్యుడు అజయ్‌కుమార్

రోడ్డు సదుపాయం లేకపోవడంతో గిరిజన ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సాక్షాత్తు ఓ గిరిజన మహిళ..గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ తమ బతుకులు మారడం లేదని వాపోతున్నారు. సాలూరు మండలం, డెన్సరాయి గిరిజన గ్రామంలో గురువారం జరిగిన వైద్య శిబిరానికి వెళ్లేందుకు వైద్యారోగ్య సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేనంతగా చాలా అధ్వానంగా దారి ఉండడంతో వర్షంలో గొడుగులు వేసుకుని కాలినడకన వెళ్లారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. తమ గ్రామానికి 108, 104 వాహనాలు కూడా రావని, రోడ్డు నిర్మాణం జరిగితే తప్ప తమ బాధలు తీరవని గ్రామస్తులు వాపోతున్నారు. త్వరితగతిన పక్కా రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– సాలూరు రూరల్

నిల్వ ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు

సాలూరు: స్థానిక పట్టణంలోని పలు బేకరి షాపులు, హోటళ్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పలువురు యజమానులు పరిశుభ్రంగా లేని, నిల్వ ఆహారం విక్రయించడాన్ని గుర్తించి, వారి నుంచి రూ.3 వేల అపరాధ రుసుం వసూలు చేశారు.ముందురోజు ఆహారం, ఆహార పదార్థాలను విక్రయించకూడదని, అలాగే నాణ్యమైన ఆహారమే అమ్మాలని సూచించారు. నిల్వ ఆహారం తినే వారు అనారోగ్యానికి గురవుతున్నారని, వారి అనారోగ్యానికి ఆ పదార్థాలు విక్రయించిన వారే కారణమవుతారన్నారు.

రెల్లి కులానికి కార్పొరేషన్ ఇవ్వకుండా అన్యాయం



రెల్లి కుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ డేనియల్

పార్వతీపురం టౌన్: రెల్లి కులానికి కార్పొరేషన్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆ కుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ గండి డేనియల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఆయన తన స్వగృహంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా రెల్లి, దాని ఉపకులాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మిగతా వారి కన్నా ఎంతో వెనకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం రెల్లి కులాల అభివృద్ధి, సంక్షేమానికి చొరవ తీసుకోవాలని కోరారు.

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది తీరాన వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో భక్తులు స్వామి వారికి ముడుపులు చెల్లించి, మొక్కలు తీర్చుకున్నారు. లోక కల్యాణార్థం స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు.

కరెంట్ బిల్లుల భారం.. మేం భరించలేం 'బాబు'!



మరిపల్లిలో కరెంట్ బిల్లులు చెల్లిస్తున్న గ్రామస్తులు

సాలూరు రూరల్: కరెంట్ బిల్లుల భారం మేం భరించలేమని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఒకప్పుడు నెలకు రూ.200 బిల్లు వస్తే ఇప్పుడు దానికి రెట్టింపు బిల్లు వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రూఅప్, విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరిట సామాన్య ప్రజలపై ఇలా భారం మోపడం సరికాదన్నారు. అధికారంలోకి రాకముందు కరెంట్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు అమాంతం పెంచేయడం దుర్మార్గమన్నారు. ఇంట్లో ఒక ఫ్యాను, ఒక బల్బు ఉన్నా గతంలో కన్నా ఎక్కువ బిల్లే వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలు మోసపోయారు..

భామిని: కూటమి నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారని.. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీల అమలులోనే కాదు ఓటింగ్‌లోనూ మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని కీసరలో పార్టీ నాయకులు తోట సింహాచలం, టింగ అన్నాజీరావు, బోనగడ్డి ధర్మారావు, మజ్జి మోహన్‌బాబు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని చంద్రబాబు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారున. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారున. ప్రస్తుతం పులివెందుల, ఒంటిమెట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వివరించారు. ప్రభుత్వం నుంచి ఎరువులు తెప్పించే ప్రయత్నాలలో పోటీ పడకుండా రైతులను మోసం చేయడంలో పాలకులు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వలరౌతు రామకృష్ణ, వలరౌతు మిన్నారావు, ఎరుకుమజ్జి పాపినాయుడు, శివ్వాల తిరుపతి, పతివాడ రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కీసరలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు